

# మావుళ్లమ్మ దర్శనం పునఃప్రారంభం

భీమవరం టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ మూల విరాట్ దర్శనం బుధవారం పునఃప్రారంభమైంది. వచ్చే నెల 13 నుంచి ప్రారంభం కానున్న అమ్మ వారి 61వ వార్షిక మహోత్సవాల సందర్భంగా విగ్రహానికి రంగులు వేసే నిమిత్తం ఈ నెల 11 నుంచి దర్శనం నిలిపివేశారు. పనులు పూర్తి కావడంతో ఉదయం ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో తాళ్లపూడికి చెందిన జంధ్యాల గంగాధరశాస్త్రి పర్యవేక్షణలో కళాన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. హోమాలు, మండపారాధన లు నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. గతంలో కలశంలోవున్న అమ్మవారి కళలను విగ్రహంలో తిరిగి నిక్షిప్తంచేశారు. తదుపరి అమ్మవారిని కుంభ దర్శనం, కూష్మాండ దర్శనం, గోదర్శనం, దర్పదర్శ నం తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. తొలుత పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయు లు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో క్రీస్తు బోధనలు వినిపిస్తున్న బిషప్ పొలిమేర జయరాజు



ఏలూరు సెయింట్ పాల్స్ చర్చిలో ప్రార్థనలు

## ఏసు బోధనలు అనుసరించాలి

### మంత్రి పార్థసారథి

నూజివీడు/చాట్రాయి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, దయ ప్రతి మనిషి అనుసరిస్తే అందరి జీవితాలు ఆనందమయం అవుతాయని నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.నూజివీడు నియోజకవర్గంలోని పలు క్రైస్తవ ప్రార్థనాలయాల్లో క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చాట్రాయి మండలంలోని చిత్తపూరు, తుమ్మగూడెం, చాట్రాయి చర్చిల్లోని ప్రార్థనల్లో ఆయన పాల్గొని క్రిస్మస్ కేక్‌లు కట్ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఏసు లోకాన్ని శాంతిమయంగా చేయడానికి పరితపించారన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో 255 క్రైస్తవ మందిరాలకు బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం టీడీపీదే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బసవారెడ్డి, శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, వివిధ గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుమ్మగూడెం చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మంత్రి పార్థసారథి

## నేటి నుంచి హెచ్‌ఎంలు, ఎస్జీటీలకు శిక్షణ తరగతులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లకు శిక్షణ తరగతులు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాకు చెందిన 139 హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు అగిరిపల్లి హీల్ ప్యారడైజ్ విద్యాసంస్థలో లీడర్‌షిప్ ట్రైనింగ్, ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి పాఠ్యాంశాలు బోధించే ఎస్జీటీలకు ఎఫ్‌ఎల్‌ఎన్ సర్టిఫికెట్ కోర్సు ట్రైనింగ్ పేరిట నిర్వహించే శిక్షణ తరగతులు భామవరంలో ప్రారంభమవుతున్నాయి. ఇవి ఆరు రోజుల పాటు కొనసాగుతాయి. ఎస్జీటీలకు మరో నాలుగు విడతల శిక్షణ తరగతులు ఇంకా మిగిలి ఉండగా, హెచ్‌ఎంలకు మాత్రం తుదివిడత శిక్షణ జరుగుతోంది. ఇవి పూర్తయిన తర్వాత సంక్రాంతి సెలవుల అనంతరం జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు జ్ఞానజ్యోతి పేరిట స్థానికంగా మండలాల్లోనే నాలుగేళ్ల వ్యవధిలో మొత్తం 120 రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ విద్యతో తత్సమానమైన పీపీ-1, పీపీ-2 తరగతులకు బోధన జరుగుతోన్న విషయం విదితమే. ఈ శిక్షణ తరగతులన్నీ సమగ్రశిక్ష జిల్లాప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించాలని పాఠశాలవిద్య ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.



### • స్వచ్ఛందంగా కదిలారు..

కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా చేపట్టిన మట్టగుంట- పెదలంక వరకు మూడు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి మరమ్మతులు శరవేగంగా సాగుతున్నాయి. రహదారిపై పడిన గోతులను ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తూ కంకరతో పూడ్చుతున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపు మేరకు కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- కలిదిండి

# వీరులెవరో!



## మార్కెట్ కమిటీల పదవులకు పోటాపోటీ

- ఇప్పటికీ నిర్ధారణ కాని రిజర్వేషన్లు
- భారీగా ఆశావహులు
- సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిళ్ళు
- టీడీపీ, జనసేనలోనే అత్యధిక పోటీ
- జిల్లాలో ఎనిమిది మార్కెట్ కమిటీలు
- త్వరలోనే నామినేటెడ్‌కు అవకాశం

జిల్లా స్థాయిలో మార్కెట్ కమిటీల పాలక మండళ్ళు నియామకం నెరపాలంటే ముందస్తుగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి. పక్షం రోజుల క్రితమే ప్రభుత్వం ఈ మేరకు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. అయినా రిజర్వేషన్ల ఖరారులో తీవ్ర జాప్యం. ఇప్పటికే మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం ఆశావహుల సంఖ్య పెద్ద సంఖ్యలోనే ఉంది. ప్రభుత్వం సైతం సంక్రాంతి నాటికి ఈ నియామకాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది. అయితే అటు ఖరారుకాని రిజర్వేషన్ల ప్రక్రియ, ఇటు పెరుగుతున్న ఆశావహుల సంఖ్య అన్ని పక్షాలకు తలనొప్పి కాబోతుంది. ఇప్పటికే మూడు దఫాలుగా నామినేటెడ్ పదవుల జాబితాను విడుదల చేసినప్పుడు ఆ జాబితాలో తమ పేరులేక డీలాపడిన సీనియర్లు ఎందరో ఉన్నారు. ఇప్పుడు మార్కెట్ కమిటీల్లోను అదృష్టం ఎవరికనేది త్వరలోనే తేలబోతుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఈ పదవి దక్కించుకుంటే చాలు.. స్థానిక ఎమ్మెల్యే తర్వాత అంతటి స్థానం సంపాదించేది ఈ పదవిలో ఉన్నవారే. అందుకనే వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి కోసం ఆది నుంచి ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. ఎన్నికల్లో ఎవరైతే తమ కోసం చెమటోడుస్తారో అటువంటి వారినే ఛైర్మన్ పదవికి ఎంపిక చేస్తారు. గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో ఈ కమిటీల నియామకంలో మార్పులు, చేర్పులు చేశారు. 33 శాతం బీసీలకు, 50 శాతం మహిళలకు ఉండేలా చర్యలను తీసుకుని అమలు చేశారు. మార్కెట్ కమిటీ నియామకం జరిగేటప్పుడు దామాషా పద్ధతిలోనే ఈ రిజర్వేషన్ ప్రక్రియ ఉండాలనేది ఆనాటి ప్రభుత్వ నిర్ణయం. ఇప్పుడు అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ దామాషా పద్ధతితోనే అనుసరించాల్సి వస్తోంది. దీంతో నామినేటెడ్ పదవుల ఖరారులో కొంత గందరగోళం లేక పోలేదు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటికి ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్లను నియమిం చాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటే ముందుగా ఆయా కమిటీల స్థితిగతులను గమ నించి దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సిన యంత్రాంగం ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకో లేదు. ఇంకోవైపు మార్కెట్ కమిటీలన్నింటికీ ఛైర్మన్ పదవికి పోటీ పడేవారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. బీజేపీ మినహాయించి జనసేన, టీడీపీకి చెందిన సీని యర్లు ఛైర్మన్ పదవికి ఎక్కువగా పోటీ పడుతున్నారు.

### నాకు కావాలి.. కాదు నాకే ఇవ్వండి

వ్యవసాయ మార్కెట్ కమిటీల నామినేటెడ్ విషయంలో ఇప్పటికే టీడీపీ, జనసేనలో తీవ్ర పోటీ నెలకొంది. గత ఎన్నికల్లో పార్టీ కోసం కష్టించి పనిచేశామని, తాము ఆ పదవికి అర్హులమంటూ సీనియర్లతో పాటు పలుచోట్ల జూనియర్లు ఇప్పటికే రంగంలో ఉన్నారు. దెందులూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి మాజీ జడ్పీటీసీ గారపాటి సీత, మాజీ ఛైర్మన్ మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), లావాటి శ్రీనివాస్, తాతా సత్యనారాయణ మధ్య మొదటి నుంచి పోటీ ఉంది. వీరిలో శ్రీనివాస్‌ను ఈ మధ్యనే కాపు కార్పొ రేషన్ డైరెక్టర్ పదవి వరించింది. బీసీ వర్గాల నుంచి సత్యనారాయణ పోటీ పడుతుండగా ఈసారి తనకే అవకాశం ఇవ్వాలని పెదపాడుకు చెందిన గారపాటి సీత పట్టుపడుతున్నారు. దీంతో ఈ మార్కెట్ కమిటీ ఓసీలకు లేదా మహిళలకు రిజర్వు అయితే ఆ కమిటీకి ఛైర్మన్‌గా సీతకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ కమిటీ నియా మకంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఏలూరు మార్కెట్ కమిటీకి నువ్వానేనా అన్నట్టుగా పోటీ ఉంది. ఈడా ఛైర్మన్ పదవి నిర్వహించిన మధ్యాహ్నపు ఈశ్వరి, ఆమె భర్త బలరాం పేర్లు సైతం వినిపిస్తున్నాయి. వీరితోపాటు నగరంలో పార్టీ బాధ్యతలు మోస్తున్న శివప్రసాద్ ఎన్నికల నుంచి ఇప్పటివరకు కీలక నేతగా ఉన్న కంప్యూటర్ చల్లా వెంకట సత్యవరప్రసాద్ (కంప్యూటర్ ప్రసాద్) పోటీలో ఉన్నారు. ఉంగుటూరు మార్కెట్ కమిటీ నుంచి టీడీపీకి చెందిన రెడ్డి చందు, పాతూరి విజయ కుమార్, జనసేనకు చెందిన వంగా రఘు పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో చందు జిల్లా తెలుగు యువత అధ్య క్షుడిగా ఉన్నారు. విజయ కుమార్ గతంలోను మార్కెట్ కమిటీ బాధ్యతలు నిర్వర్తించారు. ఉంగుటూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. ఇదే నియోజకవర్గంలో భీమడోలు మార్కెట్ కమిటీకి జనసేన నుంచి ప్రత్తి మదన్, టీడీపీ నుంచి కమ్మ పద్మ రంగంలో ఉన్నారు. ఈ రెండు కమిటీలకు సంబంధించి అటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజక వర్గ కన్వీనర్ గన్ని వీరాంజనేయులు, సిట్టింగ్ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఒక నిశ్చితాభిప్రాయానికి రావాల్సి ఉంది. ఒక్క నియోజకవర్గంలోనే రెండు కమిటీలు ఉండడంతో స్నేహపూర్వకంగానే వీరిద్దరి సిఫార్సులకు ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశం ఉంది.

చింతలపూడి మార్కెట్ కమిటీలోను భారీగా పోటీ ఉంది. జనసేన, టీడీపీ నేతలు పోటీ పడుతున్నారు. టీడీపీ సీనియర్ నేతలు అబ్బిన దత్తాత్రేయ, గుత్తా ప్రసాద్, సూరనేని గోపితోపాటు జనసేనకు చెందిన చీదరాల మధుబాబు ఛైర్మన్ పదవికి పోటీ పడుతున్నారు. గడిచిన ఎన్నికల్లో వీరంతా కూటమి పక్షాన కీలకంగా వ్యవహరించారు. ఇంతకుముందు ఇదే మార్కెట్ కమిటీ మహిళకు రిజర్వు కావడంతో అప్పట్లో జగ్గవరపు జానకీరెడ్డి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న రాజకీయ పరిస్థితులను బట్టి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆచితూచి అడుగు వేస్తారని భావిస్తున్నారు. కైకలూరు కమిటీ నుంచి కైకలూరు మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనాథరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీదేవి, బీసీ నేత పూల రామచంద్రరావు ఆశిస్తున్నారు. ఇదే నియోజకవర్గంలో కలిదిండి మార్కెట్ కమిటీకి టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజుకు దాదాపు ఛైర్మన్ గిరి ఖరారైనట్లు ఇప్పటికే ప్రచారం సాగుతోంది.

#### నూజివీడుదంతా క్లైమాక్స్‌లోనే..

నూజివీడు మార్కెట్ కమిటీ పాలక మండలి నియామకం ఎప్పుడూ రివర్సే. ఈ నియోజకవర్గంలో ఛైర్మన్ పదవి ఆశించే వారి సంఖ్య ఎప్పుడూ అత్యధికమే. కాని ఈ మార్కెట్ కమిటీకి ప్రతీసారి ఒక సెంటిమెంట్ ఉంది. ప్రభుత్వం ఏది అధికారంలోకి వచ్చినా, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎవరున్నా మార్కెట్ కమిటీ ఛైర్మన్ నియామకంలో అందరి నేర్పరితనం ఒకటే. నాలుగున్నరేళ్ల కమిటీని నాన్చి నియామకం చేయకుండా జాప్యం చేసి చివరి ఐదారు నెలలే పాలన ఉండనగా అప్పుడు ఛైర్మన్ పదవిలో ఎవరొకరిని నియమిస్తారు. పోటీ తీవ్రంగా ఉండడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఏ ఒక్కరికి ఈ పదవిని కట్టబెట్టకుండా జాప్యం చేయడమే ఇందుకు కారణం. ఈ మార్కెట్ కమిటీ పదవిని టీడీపీ నేతలు అక్కినేని చందు, చిట్నేని శివరామకృష్ణ ఆశిస్తున్నారు.

#### ఎందుకింత జాప్యం ?

మార్కెట్ కమిటీల నియామకంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం. కాని ఇక్కడే జాప్యం జరుగు తోంది. రెండు వారాల క్రితమే ప్రభుత్వం రిజర్వేషన్లను నిర్ధారించాల్సిందిగా కలెక్టర్లను ఆదేశించినా ఇప్పటి వరకు మార్కెట్ ఛైర్మన్ విషయంలో రిజర్వేషన్లను ఖరారు చేయలేదు. ఒకవేళ అదే రిజర్వేషన్లు ఖరారై ఉంటే కేవలం దీనికి అనుకూలంగానే ఒకరిద్దరు మాత్రమే పోటీ పడడం, మిగిలిన వారు రంగం నుంచి తప్పుకునేవారు. కాని ఛైర్మన్ పదవి ఆశిస్తున్న వారి సంఖ్య క్రమేపీ పెరగడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. జాప్యం జరగడానికి గల కారణాలపై అధికార యంత్రాంగం నోరు మెదపడం లేదు.

# 97 ఏళ్లుగా... అద్దె భవనాలే దిక్కు

### సొంత భవనం లేని ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ముదినేపల్లిలో పురాతన భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ముదినేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం అందిస్తున్న ముదినేపల్లిలోని సబ్ - రిజిస్ట్రార్ కార్యాలయాన్ని దశాబ్దాల తరబడి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. పురాతన కాలంనాటి పాత భవనం అరకొర సౌకర్యాలతో ఉన్నప్పటికీ ఆ భవనంలోనే కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. వర్షాకాలం ఆ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు నెదుర్కొంటున్నారు. కార్యాలయ ఆవరణ కూడా అధ్వానంగా ఉంటుంది. ముదినేపల్లిలో ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 1927 జూన్ 4న ఏర్పాటు చేయగా, అప్పటి నుంచి అద్దె భవనంల్లోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పురాతన భవనంలో ఈ కార్యాలయంలో 60 ఏళ్లుగా కొనసాగుతోంది. గతంలో ఏడాదికి లక్షల్లో వచ్చిన ఆదాయం ఇప్పుడు కోట్లకు పెరిగింది. గత నాలుగేళ్లుగా ఏడాదికి ఈ కార్యాలయంలో జరిగే భూముల, స్థలాలు, గృహాల రిజిస్ట్రేషన్ల ద్వారా ఏడాదికి సగటున రూ.2 కోట్ల ఆదాయం వస్తోంది. అయినప్పటికీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యాలయానికి సొంతభవనం నిర్మాణం విషయంలో ఏ చర్యలు తీసుకోవడం లేదు. ముదినేపల్లిలో అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయా లకు సొంత భవనాలు ఉండగా సబ్ -రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రమే అద్దె భవనంలో ఉంది. మండల కార్యాలయాల సముదాయాల ఆవరణలో సబ్ - రిజిస్ట్రార్ కార్యాలయానికి భవనాన్ని నిర్మించాలని స్థల సేకరణకు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. సబ్ - రిజిస్ట్రార్లు పలువురు గతంలో తహసీల్దార్ల ద్వారా కలెక్టర్‌కు తమ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని పంపిన వినతులు బుట్టదాఖలయ్యాయి. కూటమి ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత గూడు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### దాత ఇచ్చిన స్థలం వృథాగా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి పదిహేనేళ్ల కిందట స్థలం కొనుగోలు చేసి కొల్లి రాంబాబు అనే దాత రిజిస్ట్రేషన్ చేసి విరాళంగా ఇవ్వగా, ఆ స్థలం అనువుగా లేదని భవన నిర్మాణాలు చేపట్టలేదు. ఆ స్థలం వృథాగా ఉంది.

# వీడని అల్పపీడనం

- కొనసాగుతున్న వర్షాలు
- జిల్లాలో తీవ్రంగా చలిగాలులు
- తడిచి మొలకలు వస్తున్న ధాన్యం



జాలిపూడిలో మొలకలు వచ్చిన ధాన్యం

ఏలూరుసిటీ/ఏలూరు రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనంతో జిల్లాలో బుధవారం అంతా మబ్బుల వాతావరణం కొనసాగగా, పలు చోట్ల వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో చలిగాలుల తీవ్రత బాగా పెరిగింది. వరికోతలు పూర్తికాని పంట చేలల్లో ఎక్కువ కాలం నీటిలో నిల్వ ఉండటం వల్ల మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు బరకాలతో కప్పి ఉంచారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో 1318 రకం వరి సాగు చేసిన బేతాళ శివనాగరాజు రెండున్నర ఎకరాల్లో సాగు చేయగా కురిసిన వర్షానికి తడిచి మొలకలు వచ్చాయని వాపోయాడు. జిల్లాలో మరో రెండు రోజులు ఇదే పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. చలి వాతావరణం ఒక పక్క ఆక్వా రంగానికి తీరని నష్టాలు తెస్తున్నాయి. జిల్లాలో గడచిన 24 గంటల్లో సరాసరి 2.1 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో అత్యధికంగా పెదవేగి, జంగారెడ్డి గూడెం మండలాల్లో 4 మి.మీ వర్షపాతం నమోదైంది. కలిదిండి 3.8. వేలేరుపాడు 3.8, జీలుగుమిల్లి 3.8, కైకలూరు 3.4, బుట్టాయిగూడెం 3.4, ఏలూరు అర్బన్ 3.2, దెందులూరు 3.2, ద్వారకా తిరుమల 2.4, మండవల్లి 2.2, చింతలపూడి 2.2, చాట్రాయి 2.2, టి.నరసాపురం 2 మి.మీ వర్షపాతం నమోదైంది.



జాలిపూడిలో రోడ్డుపై ఆరబెడుతున్న ధాన్యం



వరి నారు తీస్తున్న కూలీలు

'పార్శిల్‌లో మృతదేహం'

# విస్తుగొలిపే నిజాలు

- ఆస్తి కోసం అక్కను టార్గెట్ చేసిన చెల్లెలు, మరిది
- నిందితుడు శ్రీధర్‌వర్మకు ఇద్దరు భార్యల సహకారం
- నిందితులను స్టేషన్లు మార్చి మార్చి విచారణ
- ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడి : ఎస్పీ

- మెయిన్‌లో..

## దాళ్వా వరినాట్లు ప్రారంభం

లింగపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి సాగునీరు సమృద్ధిగా ఉండడంతో మండలంలో రైతులు దాళ్వా వరినాట్లు ప్రారంభిం చారు. నారుతీతలు, వరి నాట్లతో పంటపొలాలు కూలీలతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే మండలంలో సార్వా వరి కోతలు పూర్తవ్వగా అధిక దిగుబడులు వచ్చాయని రైతులు చెబుతున్నారు. చెరువుల నిండుగా నీరు ఉండడంతో దాళ్వాకు నీటి సమస్య ఉండకపోవచ్చని రైతులు చెబుతున్నారు. ఎక్కువగా 1121 రకం వరిని దాళ్వాలో సాగు చేస్తున్నారు. మండలంలో రెండువేల ఎకరాల వరకు దాళ్వా సాగయ్యే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ తెలిపారు.


ఏలూరు ఆల్ సెయింట్స్ ఐసీఎం చర్చిలో క్రిస్మస్ కేక్ చేస్తున్న బిషప్ జాన్


చర్చిలో క్రీస్తు జననం తెలియజేసే పశువుల పాక


ఏలూరులో చిన్నారి శాంతాక్లాజ్‌ల సందడి

# ఘనంగా క్రిస్మస్ వేడుక

- క్రీస్తు జననం సంబరాలు
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు


ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక చర్చిలో ప్రార్థనలు

క్రీస్తు జన్మదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలు ప్రభువుకు ఘనస్వాగతం పలికాయి. ఏసు జననం తెలియజేసే పశువుల పాక, క్రిస్మస్ ట్రీ, స్టార్స్ విద్యుత్ వెలుగుల్లో మెరిశాయి. మానవాళి రక్షణకు అవతరించిన ఏసుక్రీస్తును భక్తితో కొలిచి ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు బోధించిన శాంతి, ప్రేమ మార్గంలో సర్వ మానవాళి ముందుకు సాగాలని చర్చి ఫాదర్‌లు తెలియజేశారు. పలు చర్చిలలో మంగళవారి రాత్రి నుంచి క్రిస్మస్ సందడి నెలకొంది. పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏలూరు జిల్లాలో ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు చర్చిల వద్ద పోలీసులు బందోబస్తు విధులను నిర్వర్తించారు.


ఏలూరు నగరంలో చర్చి వద్ద పోలీసు బందోబస్తు


ఏలూరు చర్చిలో మహిళ ప్రార్థన


బాల ఏసును పల్లకిలో ఊరేగిస్తున్న మహిళలు

## పల్లకిలో బాల ఏసు

మరియ తనయుడు బాల ఏసును మహిళలు పల్లకిలో ఊరేగించారు. క్రిస్మస్ సంబరాల్లో భాగంగా దొరసానిపాడులో బుధవారం మహిళలు స్వయంగా పల్లకి మోశారు. పెళ్లి కావాలని వేడుకుంటూ యువతులు, సంతానం కోసం వివాహితలు పల్లకిలో బాల ఏసును మోస్తారని స్థానికులు చెబుతున్నారు.

- ద్వారకాతిరుమల



## గోవిందా.. గోవిందా..

గోవింద నామ స్మరణతో చిన వెంకన్న క్షేత్రం మార్మోగింది. విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో చండీ హోమం చివరిరోజు కావడంతో మార్గమధ్యలో శ్రీవారి క్షేత్రానికి భవానీల రాకతో కిటకిటలాడింది. దాదాపు 15వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాల అంచనా. - ద్వారకాతిరుమల


దాత ఇచ్చిన బంగారం ఆలయానికి అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

## మావుళ్లమ్మకు 100 కేజీల స్వర్ణ వస్త్రం

### దాతల నుంచి బంగారం సేకరణ : ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మకు త్వరలోనే 100 కేజీల బంగారంతో స్వర్ణ వస్త్రాన్నిసిద్ధం చేస్తామని, ఇప్పటికే 50 కేజీలకు పైగా బంగారంతో ఆభరణాలు చేయించామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. పట్టణానికి చెందిన యు.దుష్యంత్ కుమార్, అరుణ కుమారి ఇచ్చిన 24 గ్రాముల బంగారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు బుధవారం దేవస్థానంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు దాతల నుంచి 74 కేజీల బంగారం సేకరించామని, 50 కేజీల బంగారంతో తొడుగు చేయించామన్నారు. మిగిలిన 24 కేజీలతో సంక్రాంతి తరువాత మరికొంత భాగాన్ని తయారుచేయిస్తామన్నారు. మరొక 26 కేజీలతో అమ్మవారికి నిలువెత్తునా బంగారం ఉండేలా దాతలను సంప్రదిస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయానికి 3 షిఫ్టుల్లో ఆరుగురు గన్‌మెన్‌తో భద్రత కల్పించాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరినట్లే ఎమ్మెల్యే అంజిబాబు తెలిపారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ, కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు పాల్గొన్నారు.


స్వామివారి చిత్రపటం వద్ద అన్నకుంభం, ప్రసాదం స్వీకరిస్తున్న మహిళలు

## భక్తాంజనేయుడికి మహా నివేదన

### నందమూరు గరువులో ముగిసిన ఉత్సవాలు

వీరవాసరం (భీమవరంటౌన్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం నందమూరు గరువు శ్రీరామ భక్త ఆంజనేయస్వామి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు స్వామివారికి మహా నివేదన ఇచ్చిన అనంతరం కమిటీ సభ్యులు అఖండ అన్న సమారాధన నిర్వహించారు. క్యూలైన్‌లో అన్న ప్రసాదం అందించారు. భక్తులు కూరలు, పులిహోర, చక్రపొంగలి, అన్నం, సాంబారుతో ప్రసాదం అందించారు. మధ్యాహ్నం సమయానికి భక్తుల తాకిడి పెరిగింది. క్యూలైన్‌లు రోడ్డుపైకి వచ్చేశాయి. ఆలయంతోపాటు ఎదురుగా ఉన్న పందరి కూడా భక్తులతో కిటకిటలాడింది. రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో శృంగవృక్షం వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు కష్టపడాల్సి వచ్చింది.

గుంపర్రుకు చెందిన బండి శ్రీనివాస్‌కు చెందిన 2 కాసుల బంగారు బ్రాస్‌లెట్ పడిపోయింది. కమిటీ సభ్యులు మైక్‌లో ప్రచారం చేశారు. భీమవరానికి చెందిన రాంబాబుకు దొరకడంతో కమిటీ సభ్యుల ద్వారా పోగొట్టుకున్న శ్రీనివాసరావుకు తిరిగి అందజేశారు.


పెన్సిల్ లిడ్‌పై ఏసు క్రీస్తు


## పెన్సిల్‌పై క్రీస్తు

నరసాపురం పట్టణంలోని రుస్తుంబాదాకు చెందిన సూక్ష్మ కళాకారుడు కొప్పినీడి విజయమోహన్ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పెన్సిల్ లిడ్‌పై ఏసుక్రీస్తు ప్రతిమను చెక్కారు. ఏలూరు నగరానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్‌బాబు ఏసుక్రీస్తు రూపాన్ని అగ్గిపుల్లపై చెక్కారు.

- ఏలూరు రూరల్/నరసాపురం టౌన్


అగ్గిపుల్లపై కరుణామయుడు

## పంచ్ కొడితే..




# పతకమే!

### బాక్సింగ్‌లో రాణిస్తున్న పెనుమంత్ర విద్యార్థులు

**బాక్సింగ్ అంటే వారికి ఎంతో ఆసక్తి. నిత్యం సాధన చేస్తూ రాటు తేలుతుంటారు. ఇప్పటికే ఎన్నో పతకాలు సొంతం చేసుకుని తమకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. బరిలో నిలిచి పంచ్ కొడితే పతకమే కైవసం చేసుకోవడం లక్ష్యంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పోటీల్లో పాల్గొంటూ బాలికలు సత్తా చాటుతున్నారు. గురువారం బాక్సింగ్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.** - పెనుమంత్ర



### ఒలింపిక్స్ పతకమే లక్ష్యం

బాక్సింగ్ అంటే ఎంతో ఇష్టం. ఒకపక్క డిగ్రీ చదువుకుంటూ పెనుమంత్రలో జీటికే బ్లూ కార్నర్ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ తీసుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం, జాతీ స్థాయిలో బంగారు, వెండి పతకాలు, రాష్ట్రస్థాయిలో 10 బంగారు, 5 వెండి పతకాలు సాధించాను. ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాలన్నదే నా లక్ష్యం. తండ్రి శ్రీనివాస్ వాటర్ సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తారు. తల్లి జ్యోతి గృహిణి. వారి ప్రోత్సాహంతో ముందుకు వెళుతున్నా.

- కండిబోయిన మాధవి, పంపనవారిపాలెం




### ఐఏఎస్ సాధించాలని కల

మాది వ్యవసాయ కుటుంబం. తండ్రి ఏడుకొండలు వ్యవసాయం చేస్తారు. అమ్మ మంగరత్నం గృహిణి. బాక్సింగ్‌లో రాణిస్తూనే చదువు కొనసాగిస్తున్నాను. ప్రస్తుతం పీజీ చేస్తున్నాను. ఐఏఎస్ సాధించాలనేది నా కల. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించా. జాతీయస్థాయిలో బంగారు, వెండి పథకాలు కైవసం చేసుకున్న. రాష్ట్రస్థాయిలో 10 బంగారు, 5 వెండి పతకాలు సాధించా. ఐదుసార్లు రాష్ట్రస్థాయి ఉత్తమ బాక్సర్ అవార్డు అందుకున్నాను.

- కోడి తేజస్విని వెంకట శైలజ, పంపనవారిపాలెం



### ఒలింపిక్స్ బరిలో దిగుతా

పెనుమంత్రలో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 9 తరగతి చదువుతున్నాను. బాక్సింగ్ నేషనల్‌లో ఒక రజత పతకం సాధించాను. రాష్ట్రస్థాయిలో రెండు బంగారు పతకాలు, 3 రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించాను. ఒలింపిక్స్ బాక్సింగ్ బరిలో దిగి బంగారు పతకం సాధించాలనేదే నా లక్ష్యం. తండ్రి చిరంజీవి, తల్లి నాగమణి బాక్సింగ్‌లో రాణించడానికి ప్రోత్సహిస్తున్నారు.

- కప్పల శరణ్య, బ్రాహ్మణ చెరువు



### జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తా

బాక్సింగ్‌పై ఎంతో మక్కువ. ఎనిమిదో తరగతి చదువుతూ క్రీడల్లో పాల్గొంటున్నా. బాక్సింగ్‌లో 2 బంగారు, 3 రజత, 2 కాంస్య పతకాలు సాధించాను. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించాలి. ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలన్నదే నా లక్ష్యం. మా తండ్రి జగదీశ్వర్ రెడ్డి, తల్లి శ్రీలక్ష్మిదేవి. బాక్సింగ్ పోటీలకు నిత్యం సాధన చేస్తా.

- కర్రి సంతోషి సుకన్య, నత్తారామేశ్వరం

# ఏలూరు నగరంలో పేకాట స్థావరం

- పోలీసుల దాడి
- 32 మంది అరెస్టు
- రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ప్రధాన నిందితుడి పరారీ


దాడిలో స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 32 మందిని అరెస్ట్ చేసి రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ వివరాలు తెలిపారు. ఏలూరు రూరల్ పరిధిలోని ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో పేకాట స్థావరం కొనసాగుతోందని ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్, టూటౌన్ ఎస్ఐ దానం, రూరల్, టౌన్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు కలిసి ఆ స్థావరంపై మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో 32 మంది అరెస్టు చేయగా మరొకరు పరారయ్యారన్నారు. పిల్లల వెంకటేష్ అలియాస్ గుట్కాలు, పెద్ది శ్రీను, నందమూరి వెంకటరత్నం స్థావరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.8.10 లక్షల నగదు, 25 సెల్ ఫోన్లు, మోటారు సైకిల్, 15 పేక కట్టలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిపై ఆర్గనైజింగ్ యాక్టు కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామన్నారు. డీఎస్పీతో పాటు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# వ్యసనాలకు బానిసై.. దొంగతనాలు

- 9 చోరీ కేసుల్లో దొంగ అరెస్టు
- రూ.13.8 లక్షల సొత్తు స్వాధీనం


నిందితుడి వివరాలు చెబుతున్న ఎస్పీ నయీం, డీఎస్పీ జయసూర్య, సీఐలు

భీమవరం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన అతడు దొంగతనాలు మార్గంగా ఎంచుకున్నాడు. రాత్రి వేళ ఇంటి తాళాలను పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నాడు, ఎట్టకేలకు పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రూ.13.8లక్షల విలువైన 210 గ్రాముల బంగారం, 1200 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరాలు తెలిపారు.

మెంటే వారి తోటకు చెందిన గోన వంశీ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. వ్యసనాలకు బానిస కావడంతో బోడపాటి ప్రవీణ్‌తో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతడు భీమవరం పోలీసులకు పట్టుబడడంతో చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో 9 చోట్ల దొంగతనాలు చేసినట్లు తెలిపారు. భీమవరం వన్ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 6, టూ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 2, రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చేశాడన్నారు. డీఎస్పీ ఆర్‌డి జయసూర్య పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఎం నాగ రాజు, టూటౌన్ సీఐ జి.కాళీ చరణ్, వన్ టౌన్ ఎస్ఎస్ఐ కిరణ్‌కుమార్ ప్రత్యేక బృందంతో నిఘా పెట్టడంతో బుధవారం ప్రకాశం చౌక్ సెంటర్లో అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతడి వద్ద బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారన్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకోవటంలో కృషిచేసిన సిబ్బందని ఆయన అభినందించి రివార్డును అందించారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

### ట్రక్ ఆటో ఢీకొని..

పెనుమంత్ర, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నత్త రామేశ్వరం శివారు పంపన వారి పాలెం వద్ద మోటార్‌సైకిల్‌ను ట్రక్ ఆటో ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. పెనుమంత్ర గ్రామానికి చెందిన గుబ్బల వెంకటేశ్వరరావు (23) ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించడంతో వాహన సిబ్బంది వెళ్లేసరికి అప్పటికే యువకుడు మృతి చెందాడు. ఎమర్జెన్సీ టెక్నీషియన్ బాలకృష్ణ పైలెట్ బ్రహ్మాజీ సహకారంతో సీపీఆర్ ప్రక్రియ చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. ప్రమాద తీవ్రతకు యువకుడి తల పగిలి మెదడు బయటకు వచ్చి కొంత దూరంలో పడి ఉండడం గమనించిన పలువురు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మృతుడి కాలు కూడా నుజ్జయింది. పెనుమంత్ర ఏఎస్ఐ వేంద్ర వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీని ఢీకొన్న కారు..

ద్వారకాతిరుమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళుతున్న కారు లారీని వెనుక నుంచి ఢీకొనడంతో కారులో ఉన్న ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో నలుగురు గాయాలపాలయ్యారు. కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన గెల్లి గౌతమ్ కుటుంబరావు (28), స్నేహితులు వి.భార్గవ్, గొల్ల తేజ, వెంకటశాయి, వి.భానుప్రకాష్ కలసి విజయవాడలో కారు అద్దెకు తీసుకుని మారేడుమిల్లి మంగళవారం రాత్రి 11 గంటలకు మారేడుమిల్లి బయలుదేరారు. ఎం.నాగులపల్లి శివారులో బుధవారం తెల్లవారుజాము 2గంటల ప్రాంతంలో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొన్నారు. గౌతమ్ అక్కడికక్కడే మృతిచెందగా కారు నడుపుతున్న భానుప్రకాష్ సహా 4గురు గాయపడ్డారు. స్థానికులు వారి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి గెల్లిసత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రైమ్ కార్నర్

### తండ్రి మందలించాడని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవిస్తు బాధ్యత లేకుండా ఉన్న కొడుకును తండ్రి మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్ముగూడెంకు చెందిన పి.దావీదు వారం రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తున్నాడు. దీంతో తండ్రి బుధవారం సాయంత్రం మందలించాడు. మనస్తాపానికి గురైన దావీదు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే అతడిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో పురుగుమందు తాగి అస్వస్థతకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం మారుతీనగర్‌లో ఉంటున్న బోను శ్రీనివాసరావు (39) ఆర్థికంగా ఇబ్బందులతో పురుగుమందుతాగాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ కడుపులో 10 కేజీల కణితి

### శస్త్రచికిత్సతో తొలగించిన వైద్యులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళ అండాశయంలో 10 కేజీల గడ్డను ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ వైద్యులు తొలగించారు. వివరాలను ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి బుధవారం తెలిపారు. నగరానికి చెందిన 54 ఏళ్ల మహిళ ఎన్నో సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో రోగనిర్ధారణ పరీక్షలు చేయగా కడుపులో పెద్ద పరిమాణంలో కణితి ఉన్నట్టు తేలింది. గైనకాలజిస్టు కోగంటి రమ్య ఆధ్వర్యంలో వైద్యుల బృందం ప్రసన్నకుమార్, ప్రశాంతి శస్త్రచికిత్సచేసి మహిళ కడుపు నుంచి 10కిలోల కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె సాధారణస్థితికి వచ్చి, ఆరోగ్యంగా ఉందని వివరించారు.


కణితి తొలగించిన వైద్యుల బృందం


క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే చంటి, మేయర్ దంపతులు


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్


తోకలపల్లిలో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ధర్మరాజు


బర్రింకలపాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిర్రి

# అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు


కొయ్యలగూడెంలో ప్రార్థనలు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను నగర ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి పలు చర్చిలలో క్యాండిల్‌లైట్ సర్వీస్‌లు జరిగాయి. సండే స్కూల్ విద్యార్థులు, యువత గేయాలతో క్రీస్తును ఆరాధించారు. అమలోద్భవి సెత్రడల్‌లో బిషప్ మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమేర దివ్యబలిపూజ నిర్వహించారు. ఐసీఎం చర్చిలో బిషప్ మోస్ట్ రెవరెండ్ జాన్ ఎస్‌డీ రాజు క్రీస్తు జననంపై వివరించారు. మన్నా చర్చిలో మోస్ట్ రెవరెండ్ బిషప్ ఎలిషారాజు పాస్టర్ ఎం.జ్యోతిరాజు క్రీస్తు ఈ లోకంలో మానవుడిగా ఎందుకో జన్మించాడు అనే విషయాన్ని వివరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, కో ఆప్షన్‌సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబులు క్రిస్మస్ ఆరాధనల్లో పాల్గొని బిషప్ ఆశీర్వాదాలు పొందారు. ఎల్ఈఎఫ్ చర్చిలో పాస్టర్ సురేష్ మార్కస్, సిస్టర్ ప్రిస్కిల్లా ఆధ్వర్యంలో చిన్నారులతో నాటికలు ప్రదర్శించారు. వలివల చర్చిలో పాస్టర్ ఆదాం సురేష్ , బెనోయేలు చర్చిలో పాస్టర్ జాన్‌బాబు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. ఆర్‌సీఎం అమలోద్భవి సెత్రడల్‌లో ఆర్‌టీసీ జోనల్ ఛైర్మన్, జనసేన నేత రెడ్డి అప్పల నాయుడు, నగర మేయర్ షేక్‌నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబులు బిషప్ జయరావు దీవెనలు పొందారు. మేయర్ షేక్ నూర్జహాన్ దివ్యాంగులతో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

**ఏలూరు రూరల్:** క్రిస్మస్ వేడుకలు ఏలూరు రూరల్ మండలంలో ఘనంగా జరిగా యి. మంగళవారం అర్ధరాత్రి నుంచి చర్చిలో ఫాదర్లు క్రీస్తు సందేశం ఇచ్చారు. ప్రభువు జననం ఘట్టాలను ఏర్పాటు చేశారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. ఉదయాన్నే సమీప చర్చిలకు వెళ్ళి దైవసందేశాన్ని విని ప్రత్యేక ప్రార్థన లు చేశారు. జాలిపూడి సీయస్ఐ చర్చిలో విచారణ కర్త తోటా ఆంథోని రాజు గుడివాకలంకలో ఎంఐ ప్రసాద్ దైవ సందేశాన్ని వినిపించారు. కేకులు కట్‌చేసి క్రిస్మస్ శుభాకాం క్షలు తెలిపారు. ఏసుచూపిన శాంతిమార్గంలో పయనిద్దామని పిలుపునిచ్చారు. శాంటా క్లాజ్‌లు సందడి చేశారు.

**పెదవేగి:** తోటివారికి సాయం చేయడమే క్రీస్తు సందేశమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో బుధవారం ఉదయం క్రిస్మస్ కేక్ కట్ చేసి మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు నంబూరి నాగరాజు, నేతల రవి, దేవరపల్లి ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

●క్రీస్తు జననం లోకానికి వెలుగు తెచ్చిందని న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ బాలస్వామి అన్నారు. న్యాయంపల్లి లోని ఆరోగ్య మాత ఆలయంలో ఫాదర్ బాల స్వామి దివ్యబలిపూజతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. తొలుత చిన్నారులు క్రీస్తు జననం, శిలువ ధారణ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సుపీఈరియర్ సిస్టర్ మేరీగ్రేస్, విశ్వాసులు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

**దెందులూరు:** క్రిస్మస్ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో టీడీపీ దెందులూరు మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని చర్చిలకు క్రిస్మస్ కేకులను, అరటి గెలలను అందజేశారు.

**జీలుగుమిల్లి:** శాంతి, దయ, కరుణ మానవాళికి జీసస్ అందించిన సుగుణాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము, జూనియర్ పవన్ కల్యాణ్, పసుపులేటి ప్రసాద్, డేవిడ్ రాజు, నూకల శ్రీను ఉన్నారు.

**కొయ్యలగూడెం:** మండలంలోని కొయ్యలగూడెం, గవరవరం, యర్రంపేట, కన్నాపురం, దిప్పకాయలపాడు, బయ్యన్నగూడెం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక అలంకరణ చేశారు.


జాలిపూడి చర్చిలో క్రీస్తు జనన దృశ్యం


మేరీమాత, బాలయేసు వేషధారణలో చిన్నారులు

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలోని ఆర్‌సీఎమ్, సీయస్ఐ, లూథరన్ తదితర చర్చిల్లో క్రిస్మస్ ఆరాధనలు ఘనంగా జరిగాయి. పలువురు దైవసేవకులు మాట్లాడుతూ క్రీస్తును అనుసరించటమే క్రిస్మస్ సారాంశమని తెలిపారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పట్టణ కార్యాలయంలో క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. టీడీపీ నాయకులు లక్ష్మణ రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకా ఈశ్వరయ్య, పెనుమర్తి రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

●చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు చింతలపూడి లయన్స్ క్లబ్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ దంపతులు, శెట్టిబలిజ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు సిహెచ్. రామలింగేశ్వరరావు, ఎస్.రామచంద్రరాజు సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కుక్కునూరు:** సర్వమానవాళికి శాంతి సందేశం ఇచ్చిన క్రీస్తు జన్మదినం పండుగ దినమని వక్తలు తెలిపారు. ప్రేమ మార్గంలో ఎవరి మనస్సునైనా జయించవచ్చని తన జీవితంలో నిరూపించారని అన్నారు. సీఐ రమేష్‌బాబు, ఎస్సై రామకృష్ణ, గ్లోరి విక్టోరియా, సంజీవరావు, పోతురాజు, మోషెయ్య, గరటం హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కామవరపు కోట:** మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిలు, ప్రార్థనా స్థలాలను అందంగా అలంకరించారు.

**బుట్టాయగూడెం:** బుట్టాయగూడెం సెయింట్ మార్క్సు లూథరన్ చర్చిలో పాస్టర్ రెవ.ఎం.ఎ.ఆమెన్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, దయ, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. దుద్దుకూరు ఏసుకృప సువార్త మందిరంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని చిన్నపిల్లలతో కేక్‌ను కట్‌చేసి పంచారు.

**పోలవరం:** పోలవరంలోని సియోను, వలీవల, కర్మేలు ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఆకుమర్తి డేవిడ్ రాజు క్రీస్తుమార్గంలో నడవాలని సూచించారు. కమ్మరగూడెంలో 124 ఏళ్ల చరిత్ర కలిగిన సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. డాక్టర్ బీరా విజయబాబు పురాతన చర్చిపై వివరించారు.


కేక్‌లను అందిస్తున్న మాగంటి నారాయణప్రసాద్

**చింతలపూడి:** స్థానిక లయన్స్ క్లబ్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చి రోషన్‌కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి మాట్లాడుతూ క్రీస్తు మార్గాన్ని అనుసరించి సమాజంలో ప్రేమ, ఆప్యాయతలు పెరగాలన్నారు. ఆహుతులందరికీ ఆయన భోజనం ఏర్పాట్లు చేశారు. నాయకులు ఘంటా మురళీరామకృష్ణ, జె.ముత్తారెడ్డి, సుధీర్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

**లింగపాలెం:** లింగపాలెం మండలంలో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలువురు బాలలు మేరీమాత, శాంటాక్లాజ్ వేషధారణలతో భక్తులను అలరించారు. పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు క్రీస్తు బోధనలను భక్తులకు వినిపించారు. అనంతరం క్రైస్తవులు కేక్‌లు, స్వీట్‌లు పంపిణీ చేశారు.

**టి.నరసాపురం:** మండలంలో బుధవారం ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. గ్రామాల్లో సువార్త ప్రకటించి కేకులు, సంఘాల్లో స్వీట్లు పంచి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా వృద్ధులు, వితంతువులకు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్లు జి.జ్ఞాన్‌రాజు, కె.నిరీక్షణరావు, సిహెచ్ హోషేయ, వై. పాల్ చిన్నారావు, సిహెచ్ రమేష్, టి. ప్రసన్నకుమార్, అకుల, ప్రసన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి సప్తాహాలు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీసప్తాహ బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి జనవరి 18వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు అలయ ప్రధాన అర్చకులు కేఎం శ్రీనివాస రామానుజాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి ఆవిష్క రించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే చంటి కోరారు. పాలడుగు రమాదేవి, ఈతకోట శ్రీనివాసరావు, ఈఓ సతీష్ కుమార్, అర్చకులు కే.నారాయణచార్యులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి మహర్దశ

ద్వారకాతిరుమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతి గ్రామానికి మహర్దశ వచ్చిందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని మారంపల్లిలో రూ.1.20 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రజాసంక్షేమ, నిష్పక్షపాత పాలన అందిస్తున్నామన్నారు.

## రూ. 20 లక్షలతో రోడ్ల నిర్మాణం

కామవరపుకోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం పంచాయతీలోని మారుతీనగర్‌లో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం కూటమి నాయకులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, నేతలు జాలపర్తి రాంబాబు, మద్దిపోటి లింగేశ్వరరావు, గోపాల్, వడ్లమూడి సత్యనారాయణ, నెక్కలపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## 5న హైందవ శంఖారావానికి తరలిరండి

ఏలూరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):ఆలయాల నిర్వహణ, హిందు సమాజానికే ఇవ్వాలనే డిమాండ్‌తో జనవరి 5వ తేదీన గన్నవరంలో నిర్వహించే హైందవ శంఖా రావం సభకు హిందువులు బారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని బీజేపీ ఏలూరు రూరల్ మండలం అధ్యక్షుడు చౌదరి పిలుపునిచ్చారు. బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. హైందవ శంఖారావం సభకు ఏలూరు రూరల్ మండలం నుంచి ఆయా గ్రామాల్లో ఆరు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తేదీ ఉదయం 8 గంటలకు బస్సులు బయల్దేరతాయని ప్రతి హిందువు తప్పనిసరిగా పాల్గొని సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పెదవేగి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కూచింపూడికి చెందిన కలతోటి మరియమ్మ, ఆమె కుమారుడు ఏలియ్యలు, సిమెంట్ రేకుల ఇంటిలో నివాసం ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంటికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు అగ్నిమాపక శాఖాధికారి వి.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోగా, బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

## కోడి పందేలపై దాడి

లింగపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భోగోలులో బెట్టింగ్‌లు పెట్టి కోడిపందేలు ఆడుతున్నారనే సమాచారంతో కోడిపందేల స్థావరంపై దాడి చేశామని ధర్మాజీగూడెం ఎస్‌ఐ కే వెంకన్న తెలిపారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక కోడి, కోడికత్తి, రూ. 1250 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రేపు విద్యుత్ కార్యాలయాల వద్ద వైసీపీ ధర్నా

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వైసీపీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాను పురస్కరించుకుని బుధవారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రప్రజల పై రూ.15,486కోట్ల విద్యుత్ భారాన్ని మోపిందని ఆయన ఆరోపించారు. నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.


నిరసనపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు


వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

## సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 30న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ జపం చేస్తున్న పాలక పక్షాలు

బుట్టాయగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గాలికొదిలి నేడు పాలక పక్షాలు కార్పొరేట్ జపం చేస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ధర్మాల సురేష్ ఆరోపించారు. బుధవారం బుట్టాయగూడెంలో ఈ నెల 28న హైదరాబాదులో జరిగే విప్లవ సంస్థల ఐక్య సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఐక్యత సభ పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు కారం రాఘవ, ఎస్.రామ్మోహన్, టి.బాబురావు, కె.నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నిరసనలు సిగ్గుచేటు

చింతలపూడి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీలపై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ ఈ నెల 27న నిరసన కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకా ఈశ్వరయ్య అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల నెత్తిన విపరీతమైన చార్జీల భారం మోపారన్నారు. ఇప్పుడు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు విద్యుత్ చార్జీలపై నిరస నలు, ధర్నాలు చేపట్టడం ప్రజలను మోసగించడమే గమ నిస్తున్నారని పేర్కొన్నారు. కరెంటు చార్జీలు తగ్గించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిసీ నిరసనలకు దిగడం అనుచితమన్నారు. జనసేన నాయకులు చీదరాల మధుబాబు, కుమార్, ఆర్నేపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేకా ఈశ్వరయ్య


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కొటికలపూడి గోవిందరావు తదితరులు

## క్యాలెండర్ ఆవిష్కరణ

ఉంగుటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు కోరారు. బుధవారం భీమవరంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ కూటమి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనకరాజు సూరి, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, పొత్తూరి కృష్ణంరాజు, చెన్నమళ్ల చంద్ర శేఖర్, నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మను ధర్మ శాస్త్ర ప్రతుల దహనం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలు ఇంకా పేదలు గానే బతుకుతున్నారంటే అందుకు కారణం మనుధర్మశాస్త్రం అని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తొర్లపాటి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మనుధర్మ శాస్త్ర గ్రంథ ప్రతులను దళిత సంఘాల ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. బిఎస్పీ రాష్ట్ర నాయకుడు కలపాల రాజ్‌కుమార్, బ్యాటరీ నాగు, రిటైర్డ్ బ్యాంకు మేనేజరు కొట్నేష్ తదితరులు పాల్గొన్నారు.



## 'సరస్వతీ ప్రసాదం' ఆవిష్కరణ

ఉంగుటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాహితీరత్న జటావల్లభుల జగన్నాథం రచనలు ఉత్తమ సమాజ నిర్మాణ కృషికి పథ నిర్దేశకాలని వక్తలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కైకరం రామలింగేశ్వరాలయంలో జటావల్లభుల రచించిన సరస్వతీ ప్రసాదం గ్రంథావిష్కరణ జరిగింది. తామరపల్లి జగన్నాథరావు, పొన్నపల్లి శ్రీరామారావు, ఆదికవి నన్నయ వర్సిటీ తెలుగు అచార్యుడు వాసు, కాకినాడకు చెందిన గిడుగు వెంకటా చలపతి రావు, సత్సంగ్ వ్యవస్థాపకుడు కొచ్చెర్లకోట శ్రీనివాసరావు, రాంపల్లి శ్రీరామ కృష్ణ, అంగర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుడు తిప్పర్తికి నివాళి

టి.నరసాపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తన జీవితాన్ని బుర్రకథ కళారంగానికి అంకితం చేసిన వ్యక్తి తిప్పర్తి వీరబ్రహ్మచారి అని ఏపీ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు అన్నారు. బొర్రంపాలెంలో బుర్రకథ కళాకారుడు తిప్పర్తి వీర బ్రహ్మచారి వర్ధంతి ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కంజరికథ కళాకారులు చిలుకూరి సుబ్బయ్యచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుర్రకథ కళాకారులు శుభాన్‌బాబు, ఫ్రాన్సిస్ బ్రహ్మచారి కుటుంబీకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహరాజ్ దివ్య మందిరం ప్రతిష్ఠ

టి.నరసాపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురంలో సంత్‌సేవాలాల్ మహారాజ్ సప్తాహాల్లో భాగంగా బంజారా బజరంగీ భేరి ఆధ్వర్యంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ దివ్య మందిరాన్ని బుధవారం సంఘం సభ్యులు ప్రతిష్ఠించారు. మహాభోగ్, జెండా ఆవిష్కరణ, మొక్కలు నాటడం, సేవాలాల్ విగ్రహ దాత భూక్యా నాగమణి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా భజరంగీ భేరి సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారా జాతికి తండా రాజ్యాన్ని స్థాపించి, గోర్ జాతిని చీకటి నుంచి వెలుగుల్లోకి తీసుకువచ్చిన సంస్కర్త, పోరాట యోధుడు సేవాలాల్ మహారాజ్ అని అన్నారు.


ఏలూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో వాజపేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


కొయ్యలగూడెంలో వాజ్‌పేయి జయంతి వేడుకలు


నాచుగుంట సడక్ యోజన రహదారి వద్ద వాజపేయి జయంతి

## మాజీ ప్రధాని వాజపేయికి ఘన నివాళి

ఏలూరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాదే రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిహెచ్ విక్రమ్‌కిషోర్ మాట్లాడుతూ వాజ్‌పేయి రాజకీయాలకు అతీతంగా దేశాభివృద్ధి, ఆత్మ నిర్భరతే లక్ష్యంగా సుపరిపాలనతో ప్రజాభిమానాన్ని చూరగొన్నారన్నారు. నాయకులు ముద్దాని దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కామవరపుకోట:** స్థానిక బీజేపీ కార్యాలయంలో వాజపేయి చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు బాల వర్ధిరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చింతలపూడి అసెంబ్లీ కన్వీనర్ ఒంటెద్దు యేసు వరప్రసాద్, కామవరపుకోట జనసేన ప్రధాన కార్యదర్శి కొప్పర్తి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం:** మాజీ ప్రధాని వాజపేయి జయంతి వేడుకలు కొయ్యలగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు బొల్లిన నిర్మలా కిషోర్, ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి, బొమ్మా బాబు, గొలిశెట్టి శ్రీను, తమ్మిశెట్టి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**కుక్కునూరు:** కుక్కునూరులో వాజపేయి జయంతి వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకుడు వాడపల్లి లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** మాజీ ప్రధాని వాజపేయి దేశ సేవలు అనిర్వచనీయమని నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి అన్నారు. బుధవారం నాచుగుంటలో వాజపేయి జయంతిని నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి,పెన్మత్స రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడిలో బీజేపీ నాయకుల నివాళి

**జంగారెడ్డిగూడెం:** స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ సమీపంలో ఉన్న వాజ్‌పేయి చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్జుల మురళీ, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఏసువరప్రసాద్, టీడీపీ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఈశ్వరయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేమూరి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**దెందులూరు:** పేదల ఆర్థికాభివృద్ధికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సేవలు చిరస్మరణీయమని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అన్నారు. గురువారం సానిగూడెం, గాలాయగూడెం గ్రామాల పరిధిలో పార్టీ మండల అధ్యక్షుడు మందూరి బుజ్జిగోపాల్ ఆధ్వర్యంలో వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**పోలవరం:** పోలవరం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతి వేడుకలు నిర్వహించారు. నాయకులు కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, గ్రంధి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడి:** మాజీ ప్రధాని స్వర్గీయ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జయంతి కార్యక్రమం పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి పరిపాలన దక్షత, బీజేపీని బలోపేతం చేసిన తీరుపై మాట్లాడారు. నాయకులు తోట వెంకట నారాయణ, మోహన్‌రావు, శింగం ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి:** భారత ప్రధానిగా వాజ్‌పేయి పనిచేసిన కాలంలో అనేక సంస్కరణలు పరవేశ పెట్టారని బీజేపీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ అన్నారు. జీలుగుమిల్లి, దర్భగూడెం గ్రామాల్లో వాజపేయి శత జయంతిని ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొండపల్లి ప్రసాద్, ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



## ముగిసిన చెస్ పోటీలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్‌హాలులో మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఏలూరుకు చెందిన డి.లక్ష్మణరావు చాంపియన్ షిప్ సాధించి విజేతగా నిలిచారు. ఆయనకు ట్రోఫీ, ప్రశంసా పత్రాన్ని ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ ఛైర్మెన్ సిహెచ్ వర్మ చేతులమీదుగా అందజేశారు. సిటీకేబుల్ ఎండి చిన్ని హరీష్ గుప్తా, టౌన్‌హాల్ అధ్యక్షుడు ఎస్.బుల్లయ్య, మద్దిపాటి నాగేశ్వరరావు, అలుగు ఆనందశేఖర్, ఎస్.రాధాకృష్ణ, మాస్టర్ చెస్ అకాడమీ కార్యదర్శి ఎస్ఎస్.చంద్రశేఖర్,జిల్లా కన్వీనర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజకృష్ణ

ఏలూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్.రాజకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విశ్వనాథ్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రాజకృష్ణకు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


దాడిలో స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

# ఏలూరులో పేకాట స్థావరం

- పోలీసుల దాడి
- 32 మంది అరెస్టు
- రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ప్రధాన నిందితుడి పరారీ

ఏలూరు క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 32 మందిని అరెస్టు చేసి రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ వివరాలు తెలిపారు. ఏలూరు రూరల్ పరిధిలోని ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో పేకాట స్థావరం కొనసాగుతోందని ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్, టూటౌన్ ఎస్ఐ దానం, రూరల్, టౌన్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు కలిసి ఆ స్థావరంపై మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో 32 మంది అరెస్టు చేయగా మరొకరు పరారయ్యారన్నారు. పిల్లల వెంకటేష్ అలియాస్ గుట్కాలు, పెద్ది శ్రీను, నందమూరి వెంకటరత్నం స్థావరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు, మోటారు సైకిల్, 15 పేక కట్టలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిపై ఆర్గ నైజింగ్ యాక్టు కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామన్నారు. డీఎస్పీతో పాటు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న కారు.. యువకుడి మృతి

ద్వారకాతిరుమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళుతున్న కారు లారీని వెనుక నుంచి ఢీకొనడంతో కారులో ఉన్న ఒక యువకుడు అక్కడిక్కడే మృతిచెందాడు. మరో నలుగురు గాయాలపాలయ్యారు. కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన గెల్లి గౌతమ్ కుటుంబరావు (28), స్నేహితులు వి.భార్గవ్, గొల్ల తేజ, వెంకటశాయి, వి.భానుప్రకాష్ కలసి విజయవాడలో కారు అద్దెకు తీసుకుని మారేడుమిల్లి మంగళవారం రాత్రి 11 గంటలకు మారేడుమిల్లి బయలుదేరారు. ఎం.నాగులపల్లి శివారులో బుధవారం తెల్లవారుజాము 2గంటల ప్రాంతంలో ముంద వెళుతున్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గౌతమ్ అక్కడికక్కడే మృతి చెందగా కారు నడుపుతున్న భానుప్రకాష్ సహా నలుగురు గాయపడ్డారు. స్థానికులు వారి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి గెల్లి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

## సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26 నుంచి జరగనున్న సీపీఐ శత వార్షికోత్సవాలను జయ ప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ జపం చేస్తున్న పాలక పక్షాలు

బుట్టాయగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గాలికొదిలి నేడు పాలక పక్షాలు కార్పొరేట్ జపం చేస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ధర్ముల సురేష్ ఆరోపించారు. బుధవారం బుట్టాయగూడెంలో ఈ నెల 28న హైదరాబాదులో జరిగే విప్లవ సంస్థల ఐక్య సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఐక్యత సభ పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు కారం రాఘవ, ఎస్.రామ్మోహన్, టి.బాబురావు, కె.నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మను ధర్మ శాస్త్ర ప్రతుల దహనం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఇంకా పేదలు గానే బతుకుతున్నారంటే అందుకు కారణం మనుధర్మశాస్త్రం అని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తొర్లపాటి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మనుధర్మ శాస్త్ర గ్రంథ ప్రతులను దళిత సంఘాల ఆధ్వర్యం లో దగ్ధం చేశారు. బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కలపాల రాజ్‌కుమార్, బ్యాటరీ నాగు, రిటైర్డ్ బ్యాంకు మేనేజరు కొట్నేష్ తదితరులు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో కోతులను తరిమేందుకు కొండముచ్చులను తిప్పుతున్న పంచాయతీ సిబ్బంది

## కోతులపై కొండముచ్చు ప్రయోగం

ముదినేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్ద రౌడీని చూసి చిన్న రౌడీ భయపడినట్లు తమ ఆకృతిలోనే పెద్దగా కనిపించే కొండముచ్చు అంటే కోతలకు హడల్. కొండముచ్చు కనిపిస్తే కోతుల గుంపులు చెల్లాచెదురవుతాయి. దీంతో గ్రామాల్లో గతంలో కొందరు వ్యక్తులు కోతులు తమ ఛాయలకు రాకుండా కొండముచ్చు ఆకారాలను ఇళ్ల గోడలపై పెట్టేవారు. ఇప్పుడు ఏకంగా కొండముచ్చులనే కోతలను తరిముందుకు గ్రామాల్లో తిప్పుతున్నారు. అదే పంథాను పంచాయతీలు అనుసరిస్తున్నాయి. తాజాగా ముదినేపల్లి గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలో కోతుల బెడదను నివారించేందుకు రెండు కొండముచ్చులను అద్దెకు తెచ్చి శనివారం నుంచి చెక్క బండిపై పెట్టి తిప్పుతున్నారు. ఇటీవల గ్రామంలో 150 కోతులను పట్టించి వేరే ప్రాంతాలకు తరలించినా మళ్లీ వాటి సంచారం ఎక్కువైపోతుంది. గ్రామంలో మహిళలను, వసతిగృహ విద్యార్థులను, పిల్లలను కోతులు కరవటమే కాక, ఇళ్లల్లోని తినుబండారాలను సైతం ఎత్తుకుపోతుండటం పెరిగిపోవటంతో గ్రామస్థుల నుంచి వస్తున్న ఫిర్యాదులతో కోతులను తరిమేందుకు పంచాయతీ అధికారులు కొండముచ్చులను ప్రయోగించారు. వీటికి రోజుకు రూ.వెయ్యి అద్దె చెల్లించాల్సి వస్తున్నది. వారం రోజులపాటు పంచాయతీ అన్ని ప్రాంతాల్లో కొండముచ్చులను తిప్పుతామని సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ తెలిపారు.




ముసునూరు ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న విచారణ గురువులు.. ఆటపాక శివారు జాన్‌పేట సీబీసీఎన్‌సీ చర్చిలో.. కలిదిండి ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కైకలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు పుట్టిన దినాన్ని పురస్కరించుకొని బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ లోకంలోకి క్రీస్తు రాకను స్వాగతిస్తూ మంగళవారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు పుట్టుక గురించి చర్చి పాస్టర్లు వివరించారు. కొవ్వొత్తులతో ప్రార్థనలు ఆరాధిస్తూ వీధుల్లో ఊరేగింపులు నిర్వహించారు. బుధవారం ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని కేక్‌లను కట్ చేశారు. పేదలకు దుస్తులు, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. కైకలూరు ఆర్సీఎం చర్చి, జాన్‌పేట సీబీసీఎన్‌సీ చర్చి, భుజబలపట్నం, పల్లెవాడ, రాచపట్నం, వేమవరప్పాడు, తామరకొల్లు, వరహాపట్నం తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**కలిదిండి** : కలిదిండి ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ బంటుమిల్లి యోహాను ఏసు క్రీస్తు బోధనలను బోధించారు. గుర్వాయిపాలెం, భాస్కరావుపేట, కోరుకొల్లు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి పంపిణీ చేశారు.

**మండవల్లి** : మండలంలోని క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**ముదినేపల్లి** : ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ పి.మరియదాసు, కొత్తపల్లిలోని పునీత జాన్ మరియ వియాన్ని గురు మండలం ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ జయరాజు ఆధ్వర్యంలో, ముదినేపల్లి గాడ్స్ లవ్ మినిస్ట్రీ ఆధ్వర్యంలోని బెతెస్తా పెంతెకోస్తు, పెయ్యేరు సీఎస్ఐ చర్చిల్లో ఫాదర్ కటికల ప్రభుదాసు, గొర్ల పీటర్ ఆధ్వర్యంలో, చేవూరు, సింగరాయపాలెం, విశ్వనాద్రి పాలెం, పెదగొన్నూరు, అల్లూరు, జానకిగూడెం, చిగురుకోట, వాడవల్లి తదితర గ్రామాల్లోని సీఎస్ఐ చర్చిల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు జరిపారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందర రామయ్య, జనసేన నాయకులు వర్రె హనుమాన్ ప్రసాద్, మొవ్వ ఫణి తదితరులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

**ముసునూరు/చాట్రాయి** : ముసునూరు, చాట్రాయి మండలాల్లో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో వేకువజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాల ఏసు, దేవదూతలు రూపాలతో సుందరంగా అలంకరించిన పశువులపాక వద్ద ప్రార్థనలు చేసి, ఏసుక్రీస్తు పుట్టిన సమయానికి వివిధ కాంతులు విరాజిల్లే బాణసంచా కాల్చారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. చాట్రాయిలోని చర్చిలలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు.

**నూజివీడు టౌన్** : నూజివీడు రోటరీ ఆడిటోరియం నుంచి ఏసుక్రీస్తు ప్రభువుకు నగరోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపక్షమాపణ, బాప్తీజం తదితర అంశాలపై దైవజనులు ప్రసంగించగా, నూజివీడు మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీని వాసరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నత్తా నాగేశ్వరరావు, పాస్టర్ డాన్‌బాస్కో తదితరులు పాల్గొన్నారు. పలు చర్చిల్లో క్రిస్మస్ కేక్‌నుకట్ చేసి వేడుకలు నిర్వహించారు.


ముదినేపల్లి పెంతెకోస్తు చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు


పి. గుడిపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

# వాజపేయికి ఘన నివాళులు

ముదినేపల్లి/కలిదిండి/మండవల్లి/ నూజివీడు టౌన్/చాట్రాయి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతి ఉత్సవాలను బుధవారం ముదినేపల్లిలో ఘనంగా జరిగాయి. ముదినేపల్లి, సింగరాయపాలెం, పెయ్యేరు తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, పార్టీ నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయికృష్ణ తదితరులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలిదిండి మండలం కొండంగిలో బీజేపీ నాయకులు వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. బీజేపీ మండల అధ్యక్షుడు నంబూరి బాందు రాజు, నాయకులు కోకా శ్రీనివాసరావు, రమేష్, చిట్టూరి రవీంద్ర, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండవల్లి మండలం పెరికేగూడెం, గన్నవరం గ్రామాల్లో మండల బీజేపీ అధ్యక్షుడు సమయం ఏసుబాబు, బీజేపీ శ్రేణులు పేరం భార్గవ్‌నాథ్, కూనపురెడ్డి శ్రీనివాసరావు, అవునాపు సోమేశేఖర్, పేరుమాళ్ళ రమేషుల ఆధ్వర్యంలో వాజపేయి శత జయంతి ఉత్సవాలను నిర్వహించారు.


పెయ్యేరులో వాజపేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో వాజపేయి జయంతి ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ నవభారత నిర్మాతగా ఆయనను కొనియాడారు. పట్టణ బీజేపీ అధ్యక్షులు బోను అప్పారావు, బీజేపీ నాయకులు మాటూరి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వాసు, రాష్ట్ర మహిళామోర్చా కార్యవర్గసభ్యులు వసుంధరాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు బావరాజు పుల్లారావు పాల్గొన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతి సందర్భంగా చాట్రాయి పీహెచ్‌సీలో రోగులకు బీజేపీ, జనసేన నాయకులు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు ఆదిమూలం శర్మ, నెక్కలపు వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల రమేష్, జనసేన నాయకుడు తుమ్మల జగన్ పాల్గొన్నారు.


పంట కాల్వ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వాసురాజు

## శివారు ప్రాంతాలకు నీరందిస్తాం..

### డీసీ చైర్మన్ వాసురాజు

కైకలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంట కాల్వలను అభివృద్ధి చేసి శివారు గ్రామా లకు సాగు, తాగునీరు అందిస్తామని కైకలూరు డీసీ చైర్మన్ పొత్తూరు వాసురాజు అన్నారు. గోపవరం నుంచి నర్సాయి పాలెం వెళ్లే పంట కాల్వలో చెత్త తొలగింపు పనులను అగ్రహారం వద్ద బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కాల్వ అభివృద్ధితో వదర్ల పాడు, నరసాయిపాలెం, గోపవరం గ్రామాలకు సాగు, తాగునీరు అందుతుందని, శివారు నరసాయిపాలెంకు మంచినీటి చెరువు నింపుకునేందుకు సాధ్యపడుతుందన్నారు. కూటమి నేతలు పేరిచర్ల ప్రసాద రాజు, పెన్మెత్స వెంకట కృష్ణంరాజు (కాంట్రాక్టర్), బోయిన శ్రీనివాసరావు, సాగు నీటి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## చర్చి అభివృద్ధికి విరాళం

ముదినేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాడవల్లిలోని సీఎస్ఐ చర్చి అభివృద్ధికి స్థానిక యువ చైతన్య ఎన్విరాన్‌మెంటల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మాదాసు సత్యనారాయణ రూ.పది వేలు విరాళం అందజేశారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం చర్చి ఫాదర్ ఏపూరి ప్రభుదాస్‌కు విరాళం అందజేశారు.

## జూదం, కోడిపందేలపై దాడి

### 12 మంది అరెస్ట్

మండవల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండవల్లి,కొవ్వాడలంక, అయ్యవారి రుద్రవరంలో బుధవారం జూదం, కోడిపందేల శిబిరాలపై మండవల్లి పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు మారు వేషాలతో శిబిరాలపై దాడులు చేసి 12 మందిని అదుపులోకి తీసుకుని రూ.6,590 స్వాధీనం చేసుకున్నారు.



స్వామికి పూజలు చేస్తున్న మహిళలు.. ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

## వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

కలిదిండి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం పురస్కరించుకుని కోరుకొల్లు వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహిళలు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తులసీ దళాలతో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు.


మంత్రి అచ్చెన్నాయుడుతో బొట్టు లక్ష్మణరావు

### కేడీసీసీబీ డైరెక్టర్ పదవి కోసం వినతి

చాట్రాయి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ పదవికి తన పేరు పరిశీలించాలని సహకార మంత్రి అచ్చెన్నాయుడుకు అమరావతిలో బుధవారం మండల టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు వినతిపత్రం అందజేశారు. సహకార సంఘం అధ్యక్షుడుగా తన సోదరుడు స్వర్గీయ విజయ చౌదరి రైతులకు ఎంతో సేవ చేశారని, అయన బాటలో అన్నదాతలకు అంకితభావంతో సేవలు అందిస్తానని లక్ష్మణరావు మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని లక్ష్మణరావు చెప్పారు.

### శ్మశాన వాటికకు స్థలం కోసం వినతి

చాట్రాయి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలం లేక నరకయాతన అనుభవిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూమి కేటాయించాలని చాట్రాయిలో చిన్నపేట, మాలపల్లి దళితవాడల వాసులు మంత్రి పార్థసారథికి మొరపెట్టుకోగా, వెంటనే స్పందించిన ఆయన తహసీల్దార్ ప్రశాంతికి ఫోన్ చేసి అనుకూలమైన ప్రభుత్వ భూమి కేటాయించాలని ఆదేశించారు. చాట్రాయి ఆర్సీఎం చర్చి దగ్గర ఏర్పాటు చేసిన తెలుగుదేశం ఫ్లెక్సీని ఎవరో చింపివేశారని స్థానిక నాయకులు మంత్రికి ఫిర్యాదు చెయ్యగా, ఎక్వైరీ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్సైని ఆదేశించారు.

## పాడి పరిశ్రమ అభివృద్ధికి గోకులాలు

చాట్రాయి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం గోకులాలను మంజూరు చేస్తున్నదని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చాట్రాయిలో ఉపాధిహామీ పథకం కింద రూ.2.30 లక్షలతో లబ్ధిదారుడు కంపసాటి శంకరరావు గృహంలో నిర్మించిన గోకులాన్ని బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులం పథకం కింద పశువుల పెంపకం దారులకు షెడ్ల నిర్మాణానికి 90 శాతం, గొర్రెలు మేకలు, కోళ్ళ పెంపకం దారులకు 70 శాతం రాయితీ ఇస్తున్నామని తెలిపారు. టీడీపీ నాయకులు కలకొండ భాస్కరరావు, కంపసాటి చెన్నారావు, గడ్డం ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

## అయ్యప్పకు అభిషేకాలు

ఆగిరిపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):స్థానిక సత్రంసెంటర్లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పమాలాదారులు మణికంటునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి బెజవాడ శ్రీను ఆధ్వర్యంలో అయ్యప్ప మాలదారులు పంచామృతాలతో మణికంటునికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

నూజివీడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గపరిధిలోని పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంత్రి సారథి అందించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మెరుగైన చికిత్స కోసం మంత్రిసారథిని కోరగా ఆయన స్పందిస్తూ ఆగిరిపల్లి మండలం పిన్నమరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొవ్వలి వసంతరావుకు 24 గంటల్లోనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4లక్షలు విలువచేసే చెక్కును బాధితులకు అందించారు.



## పేలిన రిఫ్రిజిరేటర్

ఆగిరిపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో రిఫ్రిజిరేటర్ పేలిన ఘటన ఆగిరిపల్లిలో చోటుచేసుకున్నది. స్థానిక వేద పాఠశాల రోడ్డులో చిట్టిపోతుల రవి ఇంటిలో నుంచి బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఫ్రిజ్‌పేలి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దాదాపు లక్షరూపాయలు విలువైన గృహోపకరణాలు దగ్ధం అయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఫ్రిజ్ కంప్రెషర్ పేలిపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు.

## సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

ముసునూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ళపూడిలో సారా బట్టీలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ ఎ.మస్తాన య్య, వై.వి.ఎన్.ఎస్ ఫణికుమార్‌ల ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. 10లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా తయారికి సిద్ధంగా ఉంచిన 400లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తాయారు చేస్తున్న బొట్ల శేఖర్ పారిపోయాడని చెప్పారు.

## అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడిన హోం మంత్రి అమిత్‌షా తక్షణం క్షమాపణలు చెప్పాలని సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పల్లెర్లమూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, మండల కార్యదర్శి పాలేటి సుబాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

## 30న అమిత్‌షా రాజీనామా కోరుతూ ఆందోళన

చాట్రాయి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను కించపరుస్తూ కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన్ని రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తూ 30న అన్ని వామపక్ష పార్టీలు దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు నిచ్చాయని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.హరనాథ్ తెలిపారు. ఆందోళనను జయప్రదం చెయ్యాలని ఆయన కోరారు.